క్లుప్తంగా

కొత్త పైపులైన్ల ఏర్పాటు



సంజయ్‌నగర్ కాలనీలో కొత్తగా వేస్తున్న మంచినీటి పైప్‌లైన్

కుక్కునూరు : మండల కేంద్రంలోని సంజయ్ నగర్ కాలనీలో గోదావరి నీటిని అందించేందుకు కొత్తగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. గోదావరి చెంతనే ఉన్నప్పటికి పైప్‌లైన్‌లు లేకపోవడంతో కాలనీవాసులకు గోదావరి నీటి కోసం పబ్లిక్ ట్యాప్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. కాని సర్పంచ్ ఎన్నికల్లో తాను సర్పంచ్‌గా గెలిస్తే పైప్‌లైన్ ఏర్పాటు చేస్తానని వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటి చేసిన రావు మీనా కాలనీవాసులకు వాగ్దానం చేశారు. ఆమె సర్పంచ్ అయిన తరువాత కొత్త పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయించి కాలనీవాసులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. గత మూడు రోజులుగా సాగిన పైప్‌లైన్ పనులు ఆదివారంతో ముగిశాయి.

భూతగాదాలో మహిళపై దాడి

లింగపాలెం : లింగపాలెం మండలం సింగగూడెం పంచాయతీ శివారు గొల్లగూడెంలో భూతగాదాల నేపథ్యంలో ఒక మహిళపై దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లగూడెం గ్రామానికి చెందిన మానికల సొమేశ్వరరావు, భూలక్ష్మి దంపతులకు చెందిన పొలంలో పశువుల కోసం జాడు వేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మానికల సత్యనారాయణ, హరికృష్ణ, రాంబాబు, నాగరాజు, కుమారి, వెంకమ్మ అనే వారు ఆ పొలం తమదని, ఇందులోకి ఎవరూ రావడానికి వీలు లేదని జాడు పైరుకు నిప్పంటించారు. అడ్డుగా వచ్చిన భూలక్ష్మి, సోమేశ్వరరావులపై దాడి చేయగా భూలక్ష్మికి చేయి విరిగింది. ఆమెకు చింతలపూడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులు ధర్మాజీగూడెంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం : కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. పట్టణ పరిధిలోని రామచంద్రాపురంలో దాడిచేయగా, ఇద్దరు వ్యక్తులు కోడిపందాలు ఆడుతుండగా, వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.600 నగదు, ఒక కోడి, కోడికత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాల నిలుపుదల



దేవరపల్లి తల్లాడ జాతీయ రహదారిపై నిలిపి ఉన్న వాహనాలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామానికి జాతీయ ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలను నిలిపివేస్తూ ఉండడంతో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వాహనాలను కొయ్యలగూడెం శివారు ప్రాంతాలతో పాటుగా నేషనల్ హైవేపై ట్రక్కులతో సహా పలు వాహనాలను నిలిపివేసి ఉంచుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా నిలిపివేసి ఉండడంతో జంగారెడ్డిగూడెం వైపు కొవ్వూరు వైపు రాకపోగలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు అదేవిధంగా ఇతర వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

మూడు టిప్పర్ల సీజ్

పెదవేగి : జానంపేట పంచాయతీ ప్రకాష్ నగర్ నుంచి ఏలూరుకు మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్ నగర్ నుంచి మట్టిని ఏలూరుకు రాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై వచ్చిన సమాచారంతో వాటిని స్వాధీనం చేసుకుని టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు వాటి యజమానులైన ఏలూరుకు చెందిన తాళ్ల శ్రీనివాసరావు, కామన నాగేశ్వరరావుతోపాటు ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి : కూచిపూడిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేసి, నలుగురు జూదరులను అరెస్టు చేశామని ఎస్సై లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. వారివద్ద నుంచి రూ.1,550 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరో ఘటనలో రాయన్నపాలెంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,400 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. రాయన్నపాలెంలో కోడిపందేల స్థావరంపై దాడిచేసి, నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై చెప్పారు. వారివద్ద నుంచి రూ.1,500 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

లారీ బోల్తా

దెందులూరు: జాతీయ రహదారిపై సోమవరప్పాడు- ఆశ్రం వద్ద ఆదివారం అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పల్లె ముంగిట్లోనే రైతులకు సేవలు

- గడచిన నాలుగేళ్లల్లో ఆర్‌బీకేల ద్వారా రైతన్నలకు విశేష సేవలు
- సొంత ఊరిలోనే విత్తనాలు, ఎరువులు అందజేత
- వ్యవసాయ యంత్రాలు, పనిముట్లతో సహా అన్ని ప్రభుత్వ పథకాలు లబ్ధి
- ఆర్‌బీకే వ్యవస్థ అమలుతో రైతుల కుటుంబాల్లో హర్షాతిరేకాలు



బుట్టాయగూడెంలో యంత్ర పనిముట్లు, ట్రాక్టర్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



ముప్పినవారిగూడెంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం : గ్రామ స్థాయిలోనే రైతులకు సేవలందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఆదర్శంగా నిలుస్తున్నాయి. దళారి వ్యవస్థ దరి చేరకుండా నేరుగా రైతులకు అన్ని రకాల నాణ్యమైన సేవలు ఆర్బీకేలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి.

రైతు భరోసా కేంద్రాల్లో సేవలు ఇలా

గతంలో వ్యవసాయ రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి వచ్చి అక్కడ ఉండే వ్యవసాయాధికారి కార్యాలయంలో సేవలు పొందే వారు. అందుబాటులో అధికారులు లేకుంటే మారుమూల గ్రామాల నుంచి వచ్చిన రైతులు పడిగాపులు పడేవాళ్లు. రైతుల కష్టాలను పాదయాత్రలో దగ్గరగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచి గ్రామ స్థాయిలోనే సేవలు అందేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీనితో రైతులు తమ సొంత గ్రామాల్లోనే అన్ని సేవలు పొందుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఎరువులు, విత్తనాల యంత్రాలు పంపిణీ

ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీలపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో 90 శాతం సబ్సిడీపై గిరిజనులకు విత్తనాలను, ఎరువులను ఇవ్వడం జరుగుతుంది. అలాగే వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్‌లు కూడా అందజేశారు.

కియోస్కో యంత్రంతో ఎన్నో ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు రైతులకు 48 గంటల్లోనే నేరుగా అందుతున్నాయి.

ఇ–క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం

ప్రతి రైతు తాను సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఇ–క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపానుల ద్వారా పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం పొందే అవకాశం ఉంది. రైతులకు పంట రుణాలను కూడా అందజేస్తున్నారు.

గడచిన నాలుగేళ్లుగా

గడచిన నాలుగేళ్లుగా పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఉన్న 111 ఆర్‌బీకేల ద్వారా 41,584 మంది రైతులు ఉండగా వీరికి రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల బ్యాంక్ ఖాతాల్లో సుమారు రూ.32.03 కోట్లు జమ చేయడం జరిగింది. అదేవిధంగా 99 మంది రైతులకు రూ.134 లక్షలతో యంత్రాలు పనిముట్లను పంపిణీ చేశారు. ఇలా అనేక సేవలను ఆర్‌బీకేల్లో అందించడం జరుగుతుంది.

నియోజకవర్గంలోని మండలాల సంఖ్య	– 7
మొత్తం ఆర్‌బీకేల సంఖ్య	– 111
మొత్తం రైతుల సంఖ్య	– 41,584
రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా పొందిన లబ్ధి	– రూ.32.03 కోట్లు
వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పొందిన రైతుల సంఖ్య	– 199
రైతులు పొందిన లబ్ధి	– రూ.50.26 లక్షలు
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు సంఖ్య	– 1,119
90 శాతం సబ్సిడీపై గిరిజన రైతులు పొందిన లబ్ధి	– రూ. 27.23 లక్షలు
పచ్చిరొట్ట విత్తనాలు పొందిన రైతుల సంఖ్య	– 1,563
50 శాతంతో సబ్సిడీతో	– రూ. 16.91 లక్షలు లబ్ధి

నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాకు నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా సొమ్ములు పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– కలగర నాని, రైతు, కొమ్ముగూడెం, బుట్టాయగూడెం మండలం

ఈ-క్రాప్ బుకింగ్‌తో ఎంతో మేలు



ఆర్‌బీకే సిబ్బంది ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో చేపట్టే ఈ–క్రాప్ బుకింగ్‌తో మాకెంతో మేలు జరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే పంటల బీమా పథకం ద్వారా నష్ట పరిహారం చెల్లిస్తున్నారు. రైతుల కోసం కష్టపడుతున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– వెట్టి పెంటమ్మ, మహిళా రైతు, అంతర్వేదిగూడెం, బుట్టాయగూడెం మండలం

రైతులకు అన్ని సేవలూ అందేలా కృషి చేస్తున్నాం



రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అన్ని సేవలు అందించేలా కృషి చేస్తున్నాం. కియోస్కో యంత్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయి. రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా కృషి చేస్తున్నాం.

–పీజీ బుచ్చిబాబు, ఏడీఏ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

పోతునూరులో జగనన్న భూరక్ష ప్రారంభం

చింతలపూడి : మండలంలోని పోతునూరు గ్రామంలో జగనన్న భూరక్ష కార్యక్రమాన్ని ఆదివారం సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా భూసర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా భూమి రికార్డులు తయారు చేసి భద్రపరుస్తున్నట్లు చెప్పారు. దశాబ్దాల కాలంగా పెండింగ్ ఉన్న భూ సమస్యలు రీసర్వే ద్వారా పరిష్కారం అవుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కందుల గోవర్ధనరెడ్డి, తుమ్మూరు ప్రభాకర్‌రెడ్డి, చీకటి బాపూజీ, చీకటి రమేష్, చెన్నారావు, వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వానలు కురవాలని పూజలు



బుట్టాయగూడెం : మర్లగూడెంలో పాటమ్మ తల్లికి పూజలు



జంగారెడ్డిగూడెం : ఉమారామలింగేశ్వరస్వామి అభిషేకానికి బిందెలతో నీళ్లు తీసుకువెళ్తున్న భక్తులు

బుట్టాయగూడెం : ఏరువాక, మృగశిర కార్తీ దాటి వారం అయినప్పటికీ చినుకు జాడ లేదు. రుతుపవానలు దోబోచులాడుతున్నాయి. గత నాలుగు రోజులు నుంచి 42 డిగ్రీల ఉష్ణోగత నమోదవుతుంది. భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడి పోతున్నారు. మరో రెండు రోజుల్లో రుతుపవనాలు మొదలౌతాయని వాతావరణ శాఖ ప్రకటనతో వానలు విస్తారంగా కురవాలని కోరుతూ బుట్టాయగూడెం మండలం మర్లగూడెం అటవీ ప్రాంతంలో పాటమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గుడి ఎదురుగా ఉన్న చింత చెట్టు వద్ద భజన చేస్తూ పాటలు పాడారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఉమారామలింగేశ్వరుడికి జలాభిషేకం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం బైనేరుతీరంలో వేంచేసియున్న ఉమాసహిత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామి వారికి జలాభిషేకం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేకా సింహాద్రి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మేడూరి రవితేజశర్మ బ్రహ్మత్వంలో 1008 బిందెలతో స్వామివారికి జలాభిషేకం చేశారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు బిందెలతో జలాలను తీసుకువచ్చి అభిషేకించారు. ఈ సందర్భంగా మేకా సింహాద్రి మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండి అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో బచ్చు రామ్మోహనరావు, వనపర్తి అప్పల శ్రీనివాసరావు, మేడేపల్లి రాజు, కాటేపల్లి రుద్రయ్య, ఉడా గోపి, రజని తదితరులు పాల్గొన్నారు.

మానవత మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



మానవత శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

చింతలపూడి : మానవత మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం యర్రగుంటపల్లి పొట్టి చక్రధరరావు హైస్కూల్లో నిర్వహించారు. అధ్యక్షులుగా పుల్లూరి సోమశేఖరాచార్యులు, ఉపాధ్యక్షులుగా బీవీఎస్ఎస్ రాజు, కార్యదర్శిగా అన్నవరపు రాజారావు, కోశాధికారిగా జల్లిపల్లి విశ్వేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానవత జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధర్, జిల్లా కన్వీనర్ త్రిపుర సుందరి, జిల్లా బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ అయినాల రమణమూర్తి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది 10వ తరగతిలో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన మద్రి మోక్షిత, జిల్లాలో రెండవ ర్యాంక్ సాధించిన అద్దూరి జయను సత్కరించి ఒకొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారం అందచేశారు. కార్యక్రమంలో మానవత పూర్వ అధ్యక్షులు కె.నాగ చిన్నారావు, చైర్మన్ ఆర్నేపల్లి అప్పారావు, గౌరవ డైరెక్టర్ డా ఎ.సత్యన్నారాయణ, కోచైర్మన్ ఎం.శామ్యూల్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో 108 మంది దంపతులతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : మండలంలోని కొమ్ముగూడెం కుమ్మరగట్టు వద్ద కొలువైన్న ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షిక వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది దంపతుల సమష్టి శివ చాలీసా యజ్ఞం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 పార్థివ లింగాలు ఏర్పాటు 108 మంది దంపతులతో ఏకవార రుద్రాభిషేకం, సంపూర్ణ శివ చాలీసా చేయించారు. పురోహితులు అనిపెద్ది రామకృష్ణ, అనిపెద్ది సందీప్ శర్మలు పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం 108 పార్థివ లింగాలతో శోభయాత్ర చేసి కొమ్ముగూడెం చెరువులో లింగాలను నిమజ్జనం చేశారు. విజయ గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొండేపాటి రామకృష్ణ, సోంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఘనంగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ద్వారకాతిరుమల : మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాల వద్దకు చేరుకుని సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నం సుబ్బారావు, ఉపాధ్యాయులు శేష, శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, యశోదారావులను ఈ సందర్భంగా వారు ఘనంగా సత్కరించారు. రెండు దశాబ్దాల తరువాత ఇలా అంతా ఒక్కచోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాకలపాటి రమేష్, కుమార్ రాజా, బోళ్ల రవి, లక్ష్మీనారాయణ, వైవీ నరేష్, భార్గవి, తుమ్మలమ్మ, సామ్రాజ్యం తదితరులున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి

ఏలూరు (టూటౌన్) : అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 రాష్ట్రాలు కలిగి ఉండే ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాపాడుకోవాలని కోరారు. ప్రశ్నించడం, భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా ప్రజలందరికి స్వాతంత్ర్యం ఉందని దీనిని భంగపరిచే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి , జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు ఫ్యాప్టో చేసిన కార్యాచరణను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తాత్కాలిక జిల్లా కమిటీ నాయకత్వానికి కొన్ని మార్పులు చేశారు. ప్రస్తుత అధ్యక్షులు ఆర్ రవికుమార్‌ను జిల్లా అధ్యక్షులుగా, జిల్లా సహాధ్యక్షురాలిగా వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారిగా జీవి రంగమోహన్, జిల్లా కార్యదర్శిగా యంవి బేతాళరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యునిగా సీహెచ్ పిచ్చోడును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం



విద్యార్థిని భూక్యా హర్షితను సత్కరిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, అవార్డును అందుకున్న భూక్యా హర్షితను ఆదివారం మండలంలోని కృష్ణాపురం గ్రామస్తులు సత్కరించారు. భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్, బంజారా బజరంగీ బేరి కమిటీ భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హర్షితకు వినాయకస్వామి మొమెంటో రూ.1000 నగదు ప్రోత్సాహం అందించి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో హర్షిత 530 మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్య పట్ల రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా శ్రీనివాస్, ధరావతు బంగారుబాబు, భూక్యారాజా, నాయక్, లావుడియా రవి, భూక్యా రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా శాఖలు వినతి పత్రం అందజేశాయి. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 9 ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు నాయకులు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మండలంలోని కలపర్రు టోల్ గేట్ వద్ద ఎస్సై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వారికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే విధానం జరిగే ప్రమాదాలను వారికి వివరించారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ ఉద్యోగుల ధర్నా

ఏలూరు (టూటౌన్) : సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరులోని డీసీసీబీ బ్యాంక్ వద్ద సొసైటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాలో సొసైటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా జిల్లా కమిటీ తన ప్రకటనలో కోరింది.

నేడు జగనన్న ఆణిముత్యాలకు సత్కారం

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జగనన్న ఆణిముత్యాలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెల్లం బాబురావు ఆదివారం సాయంత్రం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

డ్రెయినేజీ నిర్మాణం పూర్తిచేయండి



బయ్యన్నగూడెం యూనియన్ బ్యాంక్‌లోకి వెళ్లడానికి వీలు లేకుండా ఉన్న గొయ్యి

కొయ్యలగూడెం :బయన్నగూడెం యూనియన్ బ్యాంకు శాఖ కార్యాలయం ఎదుట ఉన్న డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయని, అయితే ఇరువైపులా మట్టి పూడిక పనులు పూర్తి చేయాలని బ్యాంకు ఖాతాదారులు కోరుతున్నారు. బ్యాంకుకు ఎదుట డ్రెయినేజీ నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో మూడు నెలలుగా 50 మీటర్ల పొడవునా గొయ్యి తీసి వదిలేశారని, అప్పటి నుంచి పూడికపనులు పూర్తి కాకపోవడంతో బ్యాంకులోకి వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బ్యాంకుకు వచ్చే వృద్ధులు, గర్భిణులు ఈ గొయ్యి దాటి అవతలికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారని, డ్రెయినేజీ నిర్మాణం పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

142 మందికి కంటి పరీక్షలు

ఏలూరు (టూటౌన్) : స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 142 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంజేఎఫ్ లైన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉషా బాలకృష్ణ సహకారంతో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం వారిచే ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని ఆస్పత్రికి వ్యానులో తీసుకెళ్లారు. 24 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

80 శాతం జగనన్న విద్యాకానుక పంపిణీ

దెందులూరు: మండలంలో 80 శాతం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ పూర్తయిందని దెందులూరు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్ బుద్ధావ్యాస్ అన్నారు. ఆదివారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభించిన రోజునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందజేసిన కానుకను విధిగా అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరఫరా, పంపిణీ సంతృప్తికర్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సహాయ సహకారాలతో విజయవంతమైందన్నారు. మిగిలిన 20 శాతం రెండు రోజుల్లో అన్ని పాఠశాలల్లో ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమన్వయంతో పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని విద్యాశాఖాధికారి బుద్ధావ్యాస్ సూచించారు. పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందపర్చామన్నారు.

గ్రామదేవతల సంబరాలపై విస్తృత ప్రచారం

దెందులూరు: సనాతన సంస్కృతి సంప్రదాయాలు హిందుధర్మం పరిరక్షణ, అభివృద్ధితో పాటు గ్రామ దేవతల సంబరాలపై విస్తృత ప్రచారానికి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు కృషి చేస్తుందని బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. ఆదివారం ఆమె నివాసంలో మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధితో పాటు ప్రణాళికాబద్ధంగా హిందూ ధర్మ రక్షణకు చర్యలు, పూజలను నూతన ఆలయ చైర్మన్, బోర్డు తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామదేవతల సంబరాలు నిర్వహించామన్నారు. తొలిసారిగా తాను ఆలయ బోర్డు డైరెక్టర్ హోదాలో గ్రామదేవతల సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.